క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ–మెయిల్ ఐడీ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

రాగిజావ పంపిణీ



రాగిజావ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: ఎండల తీవ్రత దృష్ట్యా పాదచారులు, కార్మికులు, కర్షకుల కోసం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాగిజావ పంపిణీ చేశారు. మొబైల్ చలివేంద్రాల ద్వారా కూడా రాగిజావ అందజేస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. మరో 30 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. రాగిజావ పంపిణీకి సంస్థ సభ్యులు డి.లక్ష్మణ్, టి.కృష్ణ, తదితరులు సహకరించారని తెలిపారు.

బడ్డీ తొలగించాలని వినతి



కుమ్మరవీధి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బడ్డీ

అల్లిపురం: జీవీఎంసీ జోన్ – 3 పరిధి అల్లిపురం, కుమ్మరవీధిలో అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీని తొలగించాలని వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి జోన్ – 4 కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బడ్డీ ఉన్న ప్రాంతంలో పబ్లిక్ బోరు ఉందని, దానిని బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పబ్లిక్ బోరుకు అడ్డంగా బడ్డీ ఏర్పాటు చేయడం వల్ల స్థానికులకు ఇబ్బందిగా ఉందన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో బడ్డీ ఏర్పాటు చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని ఆమె కమిషనర్‌కు వివరించారు. తక్షణమే బడ్డీని తొలగించాలని కోరారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం



అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో చేపల దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన టైల్స్



పూర్ణామార్కెట్ వద్ద నిర్మించిన అదనపు రేకుల షెడ్

వందేళ్ల మార్కెట్‌కు కొత్త కళ

- పూర్ణామార్కెట్‌కు అభివృద్ధి సొబగులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు



పూర్ణామార్కెట్ వ్యూ



అభివృద్ధి పనులు చేపట్టిన తర్వాత పూర్ణామార్కెట్

జగదాంబ: వందేళ్ల పూర్ణామార్కెట్ కొత్త కళను సంతరించుకుంది. చిన్నపిల్లలు ఆడుకునే ఆట బొమ్మల నుంచి పెళ్లిళ్లు తదితర ఫంక్షన్లకు అయ్యే సామగ్రి మొదలుకుని, ఎవరింట్లో ఏ సంబరమైనా అన్ని వస్తువులు దొరికే మార్కెట్‌గా ప్రజల మదిలో దశాబ్దాలుగా చెరగని ముద్ర వేసుకుంది ఈ మార్కెట్. పరిచయం అవసరం లేని ఈ మార్కెట్ రైతుబజార్లు ఎన్ని వచ్చినా.. ఇప్పటికీ నగరానికి తలమానికంగా నిలుస్తోంది. విశాఖనగరంతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, పాడేరు, మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వినియోగదారులందరికీ చిరపరిచితమైనది. అయితే, ఇంతటి పేరుప్రఖ్యాతులన్న ఈ మార్కెట్‌ను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుని దయనీయంగా ఉండేది. వ్యాపారులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేక వ్యాపారులు ఇబ్బంది పడేవారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ పాలనలో పూర్ణామార్కెట్‌లో రూ. 50 లక్షలకు పైగా నిధులు వెచ్చించి కొత్త హంగులు ఏర్పాటు చేశారు. ఎ, బి, సి, డి కేటగిరీల కింద రెండున్నర ఎకరాల్లో సుమారు 750 మేర దుకాణాలు ఉన్న మార్కెట్‌ను అభివృద్ధి చేశారు. ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలను తొలగించి, సరిచేశారు. ఆధునిక విద్యుత్ సౌకర్యాన్ని సమకూర్చారు. దుకాణాల నిర్మాణాలు, పెయింటింగ్, ఫుట్‌పాత్ టైల్స్, మార్కెట్ చుట్టుపక్కల రహదారులు, సీసీ రోడ్లు నిర్మించి వ్యాపారుల, వినియోగదారుల ఇబ్బందులను తొలగించారు. రూ.30 లక్షలతో అదనపు షెడ్, మెట్ల నిర్మాణం, పెయింటింగ్, లైటింగ్, రెయిలింగ్, దుకాణాలకు దిమ్మల నిర్మాణం వంటివి చేపట్టారు. రూ. 10 లక్షలతో చేతి పంపు, టైల్స్ ఏర్పాటు చేశారు. మరో రూ.10 లక్షలతో గేట్లు ఏర్పాటు చేశారు. ఆధునిక వసతులు కల్పించడంతో మార్కెట్ కళకళలాడుతోంది.

ఇబ్బందులు తొలిగాయి



పూర్ణామార్కెట్‌ను ఆనుకుని ఉన్న అరటిపండ్ల సందులో ఒక పక్క యూజీడీ, మరోపక్క వర్షపునీటితో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు సీసీ రోడ్డు నిర్మాణం చేయడంతో ఎక్కడా నీరు నిలవడం లేదు. ఇబ్బందులు తొలగాయి.

– మంగ, చేపల వ్యాపారి, పూర్ణామార్కెట్

మార్కెట్ కళకళలాడుతోంది



మార్కెట్‌కు కొత్త హంగులు ఏర్పాటు చేసిన తరువాత వినియోగదారుల సంఖ్య పెరిగింది. విద్యుత్ వైర్లు వేలాడుతూ ఉండడంతో కనీసం లోపలికి రావాలన్నా ఆసక్తి చూపేవారు కాదు. మహిళలైతే మరింత ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. అందరూ వస్తున్నారు. వ్యాపారాలు సక్రమంగా సాగుతున్నాయి.

– రాము, వ్యాపారి, పూర్ణామార్కెట్

చాలా కాలం తర్వాత..



చాలాకాలం తర్వాత పూర్ణామార్కెట్ అభివృద్ధి జరిగింది. దుకాణాల సంఖ్య పెరిగింది. వ్యాపారాలు కూడా బాగున్నాయి. ఇదంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చలవే.

– మణమ్మ, చిరు వ్యాపారి, పూర్ణామార్కెట్

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో – వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో – జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు. అందరూ వారంలో ఒక్కరోజు ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా విశాఖ నగరంలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అనధికారిక నిర్మాణంపై జీవీఎంసీ కొరడా



విశాలాక్షినగర్ కొండవాలులో నిర్మించిన అనధికార శ్లాబ్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డులో అనధికార నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. విశాలాక్షినగర్‌లో కైలాసగిరి బెటాలియన్ క్యాంప్ కార్యాలయం సమీపం కొండవాలులో ఓ వ్యక్తి అనధికారికంగా నాలుగో అంతస్తు నిర్మించాడు. ఈ నెల 13న సాధారణ ఎన్నికలు జరిగిన రోజున జీవీఎంసీ అధికారులు చూడరనే ఆలోచనతో చకచకా శ్లాబ్ వేసేశాడు. విషయం తెలుసుకున్న జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ భవనాన్ని పరిశీలించారు. అనధికార శ్లాబ్ వేసినట్లు గుర్తించారు. దీంతో సోమవారం టీపీవో వరప్రసాద్ ఆదేశాలతో స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రమేష్, సిబ్బంది భవనం వద్దకు చేరుకుని శ్లాబ్‌కు పెద్ద రంధ్రాలు చేశారు. కొండవాలు కావడంతో పాటు 12 నుంచి 15 అడుగుల వెడల్పు రోడ్డు ఉన్న ఆ ప్రాంతంలో సిల్ట్, గ్రౌండ్, ఫస్ట్, సెకెండ్, థర్డ్ ఫ్లోర్ల నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇవ్వడంపై స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ భవన యజమాని వేరేచోట ఉన్న రోడ్డును ప్లాన్‌లో చూపించి అధికారులను మేనేజ్ చేసి భవనం నిర్మించినట్లు ఆరోపణలున్నాయి. అదీ చాలక అనధికారికంగా నాలుగో ఫ్లోర్ నిర్మించేయడం విశేషం. దీనిపై ఫిర్యాదులు చేయడంతోనే అధికారులు స్పందించారని స్థానికులు అంటున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో చెలరేగిన మంటలు

పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రంగప్రవేశంతో తప్పిన ప్రమాదం



బీచ్ రోడ్డులోని ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో మంటలు

బీచ్‌రోడ్డు: ఆదివారం అర్ధరాత్రి సమయంలో రోడ్ సైడ్ ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ షాప్‌లో నుంచి మంటలు చెలరేగడంతో ఒక్కసారిగా చుట్టుపక్కల వారు ఉలిక్కిపడ్డారు. సరైన సమయంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా.. చినవాల్తేరు నుంచి పార్క్ హోటల్ వైపు వెళ్లే బీచ్ రోడ్డులోని ఓ ఫాస్ట్‌ఫుడ్ షాప్ యజమాని ఆదివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఆ షాప్ నుంచి చిన్న మంటలు వ్యాపించడం కనిపించాయి. దీనిని గమనించిన సందర్శకులు అక్కడే రాత్రి విధుల్లో ఉన్న మూడో పట్టణ ఎస్‌ఐ సంతోష్‌కు సమాచారం అందించారు. షాపులో మంటలను పరిశీలించిన ఆయన.. అందులో గ్యాస్ సిలిండర్ ఉన్నట్టు గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వెనువెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి పెనుప్రమాదం జరగకుండా నివారించారు. దీంతో చుట్టుపక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు. ఈ అగ్నిప్రమాదంలో పాక్షికంగా షాపు కాలిపోయిందని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



జగదాంబ జంక్షన్‌లో అభివృద్ధి పనులపై అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ



లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జంక్షన్‌లో నిర్మాణంలో ఉన్న క్లాక్ టవర్, లేపాక్షి జంక్షన్ అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ముందుగా జగదాంబ జంక్షన్‌లో క్లాక్ టవర్‌ను పరిశీలించి సుందరీకరణ పనులకు సంబంధించి పర్యవేక్షక ఇంజినీరు వినయ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు. ఈ నెలాఖరుకు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం లేపాక్షి జంక్షన్ వద్ద కాలువ నిర్మాణ పనులు పరిశీలించారు. సర్కిల్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని, రోడ్డు, సెంటర్ మీడియన్ పనులు వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజును ఆదేశించారు.

- జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు అభివృద్ధి చేసిన రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై గల ఆక్రమణలు వెంటనే తొలగించాలని జోన్ – 4 టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్‌ప్రసాద్‌ను కమిషనర్ ఆదేశించారు. పరిశీలనలో జోన్ – 4 జోనల్ కమిషనర్ ప్రసాదరావు, కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్బారావు, డీడీహెచ్ దామోదరరావు, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, ఏఎంవోహెచ్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంతో మనోవికాసం



సర్టిఫికెట్లతో విద్యార్థులు

అల్లిపురం: చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో మనోవికాసం కలుగుతుందని విశ్రాంత అధికారి ఆర్.రెడ్డి అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం నిర్వహించిన చిత్రలేఖన పోటీలకు ఆయన న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీల్లో చిన్నారులు వివిధ థీమ్‌లతో చిత్రాలను చిత్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయన్నారు. సెలవులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, పోటీల్లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పీవీఎస్ రాజు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలను అందరూ వినియోగించుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కార్యక్రమాలు



అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ, శ్యాంప్రసాద్

దాబాగార్డెన్స్ : మానవ హక్కులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్టు డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ తెలిపారు. మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కాలుష్య నియంత్రణ మండలి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పలు ఫార్మా, పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగంతోపాటు జీవీఎంసీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ పోర్టు, స్టీల్ ప్లాంట్, ఇతర ఫార్మా కంపెనీల కారణంగా విశాఖ నగరంలో కాలుష్యం పెరిగిపోయిందన్నారు. ప్రతీ ప్రాంతంలోనూ గెడ్డలు, కాలువలను కాపాడుకోవాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పక్కాగా అమలు చేసే క్రమంలోనే మానవ హక్కుల కౌన్సిల్ కూడా భాగస్వామ్యమై అవగాహన కార్యక్రమాలు చేపడతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మానవ హక్కుల కౌన్సిల్ నేతృత్వంలో చేపట్టబోయే అవగాహన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏయూ గాంధీయన్ విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీతామాణిక్యం, మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ఎస్‌వీ రమణ, పైడిరాజురెడ్డి, ఎన్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

భాషా ప్రావీణ్యంపై ముగిసిన వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: సంస్కృతం, హిందీ, తెలుగు భాషల ప్రావీణ్యంపై ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్‌లో నిర్వహించిన ఉచిత వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ×ఎన్‌రిచింగ్ హ్యూమన్ వ్యాల్యూస్ త్రూ లాంగ్వేజ్ లెర్నింగ్। పేరిట ఈ నెల 14న వర్క్‌షాప్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి సాంఖ్య టెక్నాలజీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.గోపి కుమార్ మాట్లాడుతూ ప్రపంచ విజ్ఞానానికి సంస్కృత భాష ముఖద్వారంగా నిలుస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యం.. భాషల ద్వారానే సుసాధ్యమవుతుందన్నారు. గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్ మాట్లాడుతూ మానవీయ విలువలకు భాషలే మూలాంధారంగా నిలుస్తాయన్నారు. సమాజంలో విలువలు పెంచే దిశగా ప్రతి ఒక్కరూ వారి వారి బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. అనంతరం గోపికుమార్‌ను సత్కరించారు. ఆచార్య అయ్యగారి ఆనంద్, వారణాసి వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

బీచ్ రోడ్డులో యథేచ్ఛగా పశు సంచారం



బీచ్ రోడ్డులో వాహనాలకు అడ్డంగా సంచరిస్తున్న గేదెలు

ఏయూ క్యాంపస్: నగరంలోని ప్రధాన రహదారులపై పశు సంచారం యథేచ్ఛగా జరుగుతోంది. అత్యధిక శాతం మంది సందర్శకులు వచ్చే సాగర తీరంలో సైతం పశువుల సంచారం పెరగిపోతోంది. అత్యంత రద్దీగా ఉండే సాయంత్రం వేళల్లో పశువులు బీచ్ రోడ్డులోని రహదారులపై అడ్డంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం జీవీఎంసీ అధికారులు చేపట్టాల్సిన అవసరం ఉంది. సోమవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఐదారు గేదెలు రోడ్డుకు అడ్డంగా సంచరించాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఒక్కసారిగా గుంపుగా గేదెలు రోడ్డుమీదకు వచ్చాయి. ఇవి అటుగా వెళ్తున్న పోలీస్ వాహనానికి సైతం అడ్డంగా రావడం గమనార్హం. నిత్యం పదుల సంఖ్యలో ఆవులు, గేదెలు బీచ్ రోడ్డులో సంచరించడం వల్ల వాహన చోదకులు, పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు వీటిని కట్టడి చేయడానికి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.